క్లుప్తంగా...

ఓయూ 106వ వ్యవస్థాపక దినోత్సవాలు షురూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 106వ వ్యవస్థాపక దినోత్సవాలు (ఫౌండేషన్ డే) 24 నుంచి 26 వరకు జరుగనున్నాయి. నేడు ఉదయం 6 గంటలకు 2కే రన్, 25న ఓపెన్ డే, 26న క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే ఉత్సవాలకు ఓయూ పూర్వ విద్యార్థి, చంద్ర గ్రహణం పైకి తొలిసారి అడుగిడిన రాకేష్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

27న జాతీయ విద్య ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 24వ జాతీయ విద్య ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. ఈ నెల 27న సీఈసీ–యూజీసీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ దర్శకులు శేఖర్ కమ్ముల ముఖ్యఅతిథిగా హాజరవుతారని అధికారులు పేర్కొన్నారు. మూడ్రోజుల పాటు జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో 20 ఎడ్యుకేషన్ చిత్రాలను ప్రదర్శించి ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి బహుమతులను అందచేయనున్నట్లు వెల్లడించారు.

రేపు ఉస్మానియా తక్ష్-2023

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫౌండేషన్ డేను పురస్కరించుకొని రేపు (25న) తక్ష్–2023 కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని వివిధ కాలేజీల్లోని ఎగ్జిబిషన్లతో పాటు ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, వర్క్‌షాప్‌లు, మ్యూజియాలను ఉచిత సందర్శనార్థం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తెరిచి ఉంచుతారని అధికారులు తెలిపారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ వైఎంసీఏలో ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు జయకర్ డేనియల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. 5 సంవత్సరాల నుంచి 16 ఏళ్ల బాలా బాలికలు పాల్గొనవచ్చన్నారు. స్పోర్ట్స్, కల్చర్, ఇంటలెక్చువల్, యోగా లాంటి అనేక యాక్టివిటీస్ నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తామన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 32, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 25, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 40, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 18, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 19, దోసకాయ 21, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 23, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 45, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 5–6.

'ఓయూ వీసీ తీరు సరికాదు'

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నేతలను ఇటీవల జరిగిన మహనీయుల జయంతి ఉత్సవాల ముగింపు సభలో వ్యక్తిగతంగా వీసీ ప్రొ. రవీందర్ దూషించడం దారుణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంచిన పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజును తగ్గించాలని గత పది రోజులుగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులకు సమాధానం ఇవ్వకుండా పరిశోధన విద్యార్థి ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య పై వీసీ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయకుండా పీహెచ్‌డీ ఫీజును తగ్గించాలని లేకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



రసూల్‌పురా: గతేడాది నవంబర్‌లో వికారాబాద్‌లో ధారూర్ జాతరకు వెళ్తుండగా బస్సు బోల్తా పడిన సంఘటనలో మృతి చెందిన రసూల్‌పురాకు చెందిన స్వరూప కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఆదివారం చేవెళ్ల ఎంపీ రంజీత్‌రెడ్డితో కలిసి రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, స్వరూప భర్త జైపాల్, కుటుంబసభ్యులకు జూబ్లీహిల్స్‌లోని ఎంపీ నివాసంలో అందజేశారు.

సాంకేతిక లోపంతో సినిమా నిలిపివేత

- థియేటర్ పై ప్రేక్షకుల దాడి

సనత్‌నగర్: మూసాపేటలోని ఏషియన్ లక్ష్మీకళ థియేటర్ లో ప్రదర్శిస్తున్న 'విరూపాక్ష' సినిమా ప్రదర్శనలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆదివారం సాయంత్రం ఫస్ట్ షో నిలిపివేశారు. ఆగ్రహానికి గురైన ప్రేక్షకులు థియేటర్ పై దాడి చేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సాయి ధరమ్ తేజ్ నటించిన విరూపాక్ష సినిమా కోసం ప్రేక్షకులు టికెట్ తీసుకుని గంట సేపైనా సినిమా వేయకపోవడంతో కొందరు థియేటర్ లోని అద్దాలు ధ్వంసం చేశారు. ఘటన అనంతరం ప్రేక్షకుల డబ్బును తిరిగి ఇచ్చారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తెలిపారు.



యోగా మార్గం.. ఆరోగ్య భాగ్యం

- ఆరోగ్యప్రదాయినిగా 'భారతీయ యోగా సంస్థాన్'
- పార్కుల్లో ఉచితంగా యోగా శిక్షణ
- నవ్వు నవ్వించు.. జీవించు.. జీవింపజేయు నినాదంతో ముందుకు..



జెక్‌కాలనీలో యోగాసనాలు వేస్తున్న మహిళలు

సనత్‌నగర్: నవ్వు నవ్వించు, జీవించు జీవింపజేయు అన్నదే ఆ సంస్థ నినాదం.'స్వాస్థ్' భారత్ (ఆరోగ్య భారతం)ను నెలకొల్పేందుకు 'యోగా'నే దిక్సూచి అంటూ నలుదిశలా చాటిచెబుతోంది. సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించగలిగే 'స్థిత ప్రజ్ఞత'కు మూలం యోగాసనాలేనని ఘంటాపదంగా పేర్కొంటూ ఎందరికో ఆరోగ్య దానం చేస్తోంది భారతీయ యోగ్ సంస్థాన్.

యోగా నిపుణులతో..

సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కు, లోధా అపార్ట్‌మెంట్, నక్షత్రవనం, వినాయకగ్రౌండ్, బీకేగూడ పార్కు, జెక్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఉచితంగా యోగా శిక్షణిస్తూ ఆరోగ్య ప్రదాయినిగా మారింది. యాంత్రిక జీవనంలో శారీరక వ్యాయామం చేసే తీరిక లేకపోవడంతో సక్రమమైన పెరుగుదల లేక దేహం వికతంగా మారిపోవడం, శ్వాసకోశ వ్యాధులు దరిచేరుతున్నాయి. వీటన్నింటికీ యోగా సాధన ద్వారా చెక్ చెప్పవచ్చంటూ ఎందరికో యోగా శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కులో యోగా నిపుణులు వర్ధన్‌నాయక్ పర్యవేక్షణలో ఆయా కేంద్రాల్లో యోగా శిక్షణ కొనసాగిస్తున్నారు.

పార్కులే ప్రధాన కేంద్రాలుగా..

ఆహ్లాదకరమైన వాతావరణానికి కేరాఫ్ ఉద్యానాలు. అలాంటి వాతావరణాన్ని కేంద్రంగా చేసుకుని నగరంలో భారతీయ యోగ్ సంస్థాన్ వందలాది మందికి ఉచితంగా యోగా శిక్షణ ఇస్తోంది. ఇక పార్కులతో పాటు అపార్ట్‌మెంట్లలో సైతం ప్రత్యేకంగా మహిళలకు శిక్షణ ఇస్తూ ఒత్తిడిని చిత్తు చేస్తున్నారు. యోగా సాధన ద్వారా ఎలాంటి రుగ్మతనైనా దూరం చేయవచ్చని ఇక్కడి సాధకులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు జ్ఞాపక శక్తిని పెంచే యోగాసనాలు, శరీరాన్ని తేలికపరిచి, సాధారణ ఆరోగ్యం కాపాడే యోగాసనాలు, దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బు, ఆమ్లపిత్తం, మెడ, నడుము నొప్పులు తదితర వాటిని యోగా ద్వారా తగ్గించడమే కాకుండా రాకుండా నివారించే యోగాసనాల్లో శిక్షణ అందిస్తున్నారు.

ఇక్కడ తమ నవ్వుల పువ్వులతో హాస్యరసాలను ఊరిస్తారు. నవ్వేవాడు యోగి.. నవ్వించేవాడు భోగి..నవ్వలేని వాడు లేజీ..అంటూ తమ చతుర్శోక్తులతో పార్కుకు వచ్చే వాకర్స్‌లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తుంటారు. తమ నవ్వుల పువ్వులతో ఇతరుల మోములపై నవ్వులను పూయించేలా చేస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ యోగా వైపు మళ్లిన ఆ హృదయాలు ఇప్పుడు మరిన్ని హృదయాలకు ఊరటనిచ్చే కేంద్రాలయ్యాయి. యోగాసనాలను నేర్చుకుని మరీ తాము ఆరోగ్యం సాధించడమే కాదు ఇతరులకు ఆరోగ్యాన్ని పంచేందుకు అదే యోగాసనాలను వారికి నేర్పే స్థాయికి ఎదిగారు.

గత 20 ఏళ్లుగా..

భారతీయ యోగా సంస్థాన్ వేల మందిని యోగ శిక్షణ వైపు అడుగులు వేయించింది. ఎందరో తమ అనారోగ్య సమస్యల నుంచి బయటపడేలా చేసింది. అందరితో పాటు పార్కుల్లో యోగా చేయడమే కాకుండా స్వతహాగా ఇళ్లలో చేసుకునే విధంగా శిక్షణ ఇస్తున్నాం. కోవిడ్ సమయంలో తమ తమ ఇళ్లల్లోనే యోగాసనాలు వేసి తమ ఆరోగ్యం చెక్కు చెదరకుండా చేసుకున్నారు. 2003 నుంచి సనత్‌నగర్ ప్రాంతంలో యోగా శిక్షణ కొనసాగుతుంది. –వర్ధన్‌నాయక్, డిస్ట్రిక్-1 అధ్యక్షుడు



సీనియర్ సిటిజన్స్ అనుభవాలు అభివృద్ధికి నాందిగా నిలవాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అసోసియేషన్‌తో పాటు ఆసరా కమిటీ తరుపున చేసిన సేవలకు సంబంధించి ఫొటోలతో ముద్రించిన బ్రోచర్‌ను ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ అనుభవాలు, ఆలోచనలు అభివృద్ధికి నాందిగా నిలవాలని ఆకాంక్షించారు. మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ ఇతర అసోసియేషన్లకు ఆదర్శంగా నిలిచేలా విభిన్న కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. 70 సంవత్సరాల పైబడిన వారిని సన్మానించి వారిలో ఉత్తేజాన్ని నింపడంతో పాటు తామున్నామన్న భరోసా కల్పించడం శుభపరిణామన్నారు. వివిధ అసోసియేషన్లకు చెందిన సీనియర్ సిటిజన్స్‌కు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తూ ఉల్లాసాన్ని ఇస్తున్న మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ సభ్యులు సుబ్బారెడ్డి, వెంకటేష్‌శర్మ, వైకేడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నూతన కమిటీ సభ్యులు..

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ దేవస్థానం బోర్డు నూతన కమిటీ సభ్యులు అభివృద్ధికి సంబంధించి తమ ఆలోచనలను ఎప్పటికప్పుడు పంచుకోవడం ద్వారా మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని మంత్రి తలసాని సూచించారు. ఎల్లమ్మ–పోచమ్మ దేవస్థానం బోర్డు నూతన కమిటీ సభ్యులు ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కే సుబ్బరాజు, సరాఫ్ సంతోష్, యాదగిరి గుప్తా, పుష్పలతాశ్రీనివాస్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయానికి భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో కొలను బాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సురేందర్‌సింగ్, గులాబ్‌సింగ్ రాజ్‌పురోహిత్, పీయూష్‌గుప్తా, సురేందర్ ఉన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బంగారు మైసమ్మ దేవాలయ 8వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో అమ్మవారికి విశేష కుంభాభిషేకం, పంచహారతులు, మహాచండీ యాగం నిర్వహించారు. మహాచండీ యాగం కార్యక్రమానికి సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్ల కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, చిలకలగూడ పీఎస్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ శ్రీనివాస్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ధనశేఖర్, ప్రమోద్, జగదీశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చండీ యాగానికి హాజరైన కార్పొరేటర్ హేమ, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు

మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



సదస్సులో పాల్గొన్న ప్రొ.గాలి వినోద్‌కుమార్, రాగటి సత్యం

బన్సీలాల్‌పేట్: మహనీయుల ఆశయాలు, ఆదర్శలను స్ఫూర్తిగా తీసుకొని పేదలు ఉన్నతంగా జీవించాలని ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. అణగారిన కులాల పారిశ్రామిక, నిశ్చయ కార్యాచరణ వాణిజ్య మండలి(డిక్కా) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బన్సీలాల్‌పేట్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా 'దళిత చైతన్య సదస్సును'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాజ్యోతిబా పూలే, డాక్టర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ సిద్ధాంతాలతో ఎదగాలన్నారు. మహనీయుల మార్గంలో నడుస్తూ విద్యా, ఆర్థిక, రాజకీయ, సామాజిక పరంగా అభివృద్ధి చెందాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అట్టడుగు వర్గాలు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందేలా డిక్కా సంస్థ కృషి చేయాలని కోరారు. అనంతరం డిక్కా సంస్థ చైర్మన్ రాగటి సత్యం మాట్లాడుతూ.. ఎస్సీ ఉపకులాలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తాము అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. డిక్కా సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రాగటి భవానీ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నల్గొండ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగారం అంజయ్య, ప్రమోద్ గురుదేవ్, రామక్రిష్ణ, గాంధీ, లక్ష్మీ, నళిని, ప్రియాంక, నర్సింగ్‌రావు, క్రిష్ణంరాజు, కృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీల అభ్యున్నతికి కృషి చేస్తా

చిలకలగూడ : మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిలకలగూడకు చెందిన సామాజిక సేవకుడు మ్యాకల ఇంద్ర ఏకగ్రీవంగా నియమితులయ్యారు. మాలమహానాడు సెంట్రల్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఇంద్ర మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ ఎస్సీలను సంఘటితం చేసి వారి అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న ఇంద్ర

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పలువురికి గాయాలు

రాంగోపాల్‌పేట్: వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు కారుని ఢీకొట్టడంతో ఏడుగురికి గాయాలైన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చెన్నైకి చెందిన జితేందర్ జైన్ (34) అక్షయ తృతీయ కోసం కుటుంబ సభ్యులతో రైలులో సికింద్రాబాద్‌కు వచ్చారు. ఆదివారం ఉదయం వారి బంధువైన అమిత్ జైన్ కారులో వారిని తీసుకుని డీవీకాలనీకి వెళ్తున్నారు. కారు ప్యారడైజ్ చౌరస్తాకు రాగానే ఎంజీరోడ్డు నుంచి వేగంగా వచ్చిన నిజామాబాద్‌కు చెందిన ఆర్టీసీ బస్సు సిగ్నల్ ఉన్నా పట్టించుకోకుండా వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టగా కారులో ఉన్న జితేందర్ జైన్ (34), పద్మజైన్(37), ఆపేక్ష జైన్ (26), అమిత్ జైన్ (24), సంజయ్ జైన్ (33), హిమాన్షు జైన్ (7), వియారా జైన్ (3) గాయపడగా వారిని సన్‌షైన్ ఆస్పత్రికి తరలించారు. అమిత్ జైన్, జితేందర్ జైన్, హిమాన్షుజైన్, వియారా జైన్ విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ప్రేమవిఫలమై యువకుడి ఆత్మహత్య

బన్సీలాల్‌పేట్: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన కేశవకుమార్ (22), రవికుమార్ సోదరులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి సికింద్రాబాద్ రైల్వేలో బోగీలు శుభ్రం చేస్తూ బోయిగూడ సున్నంబట్టీ ప్రాంతంలో ఉంటున్నారు. ఇరువురు వివిధ షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున రవికుమార్ ఇంటికి వచ్చే సరికి కేశవకుమార్ ఇంట్లో ఉరేసుకొని కనిపించాడు. వెంటనే 108కు కాల్ చేసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రేమలో విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోదరుడు రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



మృతి చెందిన కేశవకుమార్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అమీర్‌పేట: అనుమానాస్పద స్థితిలో ఓ మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని ఓ షాపు వద్ద శనివారం రాత్రి ఓ వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా 40 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని ఇతర అనారోగ్య కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో విచారణ చేస్తున్నారు. మృతుడి వద్ద లభించిన ఓ గుర్తింపు కార్డులో గోనెల శివశంకర్, తెలుగు సినీ, టీవీ జూనియర్ సభ్యుడు అని రాసి ఉందని, ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి అన్నది తెలియరాలేదు. ఒంటిపై పింక్ కలర్ చొక్కా, బ్లూ కలర్ లుంగీ ఉందని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

క్రైం కార్నర్..

రైలులో గుర్తు తెలియని మృతదేహం



సికింద్రాబాద్: మన్మాడ్–సికింద్రాబాద్ రైలు బోగీలో మృతదేహాన్ని సికింద్రాబాద్ రైల్వేపోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకుంటున్న రైలు బోగీలోని బాత్రూమ్ వద్ద ఒక వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు సుమారు 40 ఏళ్ల ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు.

కుటుంబ సభ్యుల పరస్పర దాడులు

- 8 మందిపై కేసు నమోదు

చిలకలగూడ : కుటుంబ కలహాల నేపథ్యంలో పరస్పరం దాడులకు పాల్పడిన ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీబస్తీకి చెందిన యాదమ్మ, మహేష్ అన్నాచెల్లెళ్లు, ఒకే ఇంట్లోని రెండు పోర్షన్లలో ఉంటున్నారు. సదరు ఇంటి స్థలం విషయమై ఇరు కుటుంబాల మధ్య అభిప్రాయబేధాలు రావడంతో గత కొన్ని రోజులుగా ఘర్షణ పడుతున్నారు. ఇదే విషయమై శనివారం రాత్రి గొడవ పడి ఒకరికొకరు కొట్టుకుని పోలీసులను ఆశ్రయించారు. ఇరువురి ఫిర్యాదులు మేరకు యాదమ్మ, విజయలక్ష్మీ, కావ్య, రేణుక, మహాలక్ష్మీ, మహేష్‌లతోపాటు మొత్తం ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

సనత్‌నగర్: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు యువతులు అదృశ్యమైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట బ్రాహ్మణవాడీ మాతాజీనగర్‌లో ఉండే ఓ యువతి (17) నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో సెక్యూరిటీ విభాగంలో పని చేస్తోంది. ఈ నెల 12న జ్వరం రావడంతో విధులకు వెళ్లడం లేదు. అదే రోజు ఉదయం తల్లిదండ్రులు పనికి వెళ్లి సాయంత్రం వచ్చేసరికి పూజిత కనిపించలేదు. తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో..

బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీకి చెందిన శ్వేత (20) ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన రైళ్లు ఢీ కొట్టిన వేర్వేరు ఘటనల్లో ఇరువురు మృతి చెందిన ఘటనలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. అల్వాల్ శివనగరకు చెందిన కౌశిక్‌మాలిక్ (27) ప్రైవేటు ఉద్యోగి. అమ్ముగూడ–సనత్‌నగర్ రైల్వేస్టేషన్ల పరిధిలో పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మరో ఘటనలో..

బొల్లారం–గుండ్లపోచంపల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో సుమారు 40 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వంటిపై నీలిరంగు ట్రాక్ ప్యాంటు, ఎరుపు రంగు టీ షర్టు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

చేవెళ్లలో ఆదివారం జరిగిన బహిరంగ సభకు విచ్చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికారు. –సనత్‌నగర్





కానుకలను అందజేస్తున్న దృశ్యం

తమిళుల సంక్షేమానికి కృషి

రసూల్‌పురా: తెలంగాణ తిరువల్లువర్ తమిళ్ సంఘం ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లోని తమిళుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తున్నట్లు కంటోన్మెంట్ ఇన్‌చార్జి వినిత తెలిపారు. ఆదివారం తిరుమలగిరి ఆర్యవైశ్య సంఘం కమ్యూనిటీహాల్లో జరిగిన తమిళ సంఘం సమావేశంలో అధ్యక్షుడు రాజా అంగముత్తు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వినీత మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని తమిళుల సంక్షేమం కోసం తమ తిరువల్లువర్ తమిళ సంఘం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. తమిళ న్యూ ఇయర్ ఉత్సవాలను పక్షం రోజుల పాటు కంటోన్మెంట్‌లో నిర్వహిస్తున్నామని రాజా అంగముత్తు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు పేద తమిళ మహిళలకు కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళ సంఘం సలహాదారు జయశీలన్, సంఘం జాయింట్ సెక్రటరి సి రుపేష్ కుమార్, కోశాధికారి రాకేష్ పాల్గొన్నారు.

తిరుమల యాత్రలో డిప్యూటీ స్పీకర్

సికింద్రాబాద్: శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదివారం తిరుమల యాత్రకు బయలుదేరారు. రేణిగుంట విమానాశ్రయంలో ఏపీ ఎమ్మెల్సీ సీ.రమేశ్‌యాదవ్ నేతృత్వంలో పలువురు నాయకులు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన పద్మారావుగౌడ్‌కు స్వాగతం పలికినట్టు డిప్యూటీ స్పీకర్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ నెల 25న నగరానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తిరిగి వస్తారని తెలిపారు. అదే రోజు సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో జరిగే నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో పాల్గొంటారన్నారు.



రేణిగుంటలో పద్మారావుగౌడ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్

చలివేంద్రాలు ప్రారంభం

లాలాపేట: మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని బీజేపీ నాయకురాలు బండా కార్తీకరెడ్డి అన్నారు. తార్నాక చౌరస్తాలో బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం శ్యామ్‌సుందర్‌గౌడ్‌తో కలిసి కార్తీకరెడ్డి ప్రారంభించారు. నాగేశ్వర్‌రెడ్డి, శారదా మల్లేష్, గణేష్ ముదిరాజ్, సంపత్, శివారెడ్డి, రాము వర్మ, ప్రకాష్, రాజేష్, సాయి, లడ్డు తదితరులున్నారు.

- తార్నాకలోని సుదర్శన్‌రెడ్డి స్వీట్‌హౌజ్ సమీపంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. రోజు రోజుకు తీవ్రమవుతున్న ఎండలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం